విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

శాశ్వత లోక్ అదాలత్ సేవలపై అవగాహన కల్పించాలి



విశాలాంధ్ర-ఏలూరు: ప్రజా ప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్ చైర్ పర్సన్ ఎ. మేరీ గ్రేస్ కుమారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శనివారం ఏలూరు జిల్లాలోని సంబంధిత అధికారులతో శాశ్వత లోక్ అదాలత్ అందించే సేవలు పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఎ. మేరీ గ్రేస్ కుమార్ మాట్లాడుతూ ఈ శాశ్వత లోక్ అదాలత్ ద్వారా ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. విద్య, వైద్యం, పోస్టల్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, రవాణా, పారిశుద్ధ్యం, బ్యాంకింగ్, ఎన్ఆర్ఈజీఎస్, టెలికం సేవలలో లోపం జరిగితే శాశ్వత లోక్ అదాలత్ ను ఆశ్రయించ వచ్చని, సంబంధిత అధికారులు ప్రజలలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు. ఈ సదస్సులో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణకు ఎందరో పోలీసులు అమరులయ్యారు

- ఎస్పి రవి ప్రకాష్

విశాలాంధ్ర -భీమవరం టౌన్: సమాజంలో ప్రజలకు రక్షణ, భద్రత కలిగించడానికి ఎందరో పోలీసులు అమరులయ్యారని జిల్లా ఎస్పి రవి ప్రకాష్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శనివారం టౌన్ హాల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఇటీవల ఏలూరు జిల్లాలో వినాయక చవితి సందర్భంగా రాత్రిపూట జరుగుతున్న కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని తెలియజేసిన కానిస్టేబుల్‌ను వెనుక వైపు నుంచి ఒక వ్యక్తి కర్రతో దాడి చేయడంతో ఆ కానిస్టేబుల్ మృతి చెందారని జరిగిన సంఘటనను ఆయన గుర్తు చేశారు. ప్రమాదంలో ఉన్న వారికి రక్తదానం ద్వారా మరో కొత్త జీవితాన్ని ప్రసాదించ వచ్చునన్నారు. పోలీసులతో పాటు భీమవరం డివిజన్‌లోని వివిధ కళాశాల విద్యార్థులు, ఆటో డ్రైవర్లు తదితరులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం డీఎస్పీ శ్రీనాథ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ యం. వీరాస్వామి, సంఘ సేవకుడు చెరుకువాడ రంగ సాయి,పట్టణ సిఐలు అడబాల శ్రీనివాస్ ,గుత్తుల శ్రీనివాస్‌లతో పాటు ఇతర సీఐలు, ఎస్సైలు పోలీసులు పాల్గొన్నారు.

టీడీపీ నిరసన

విశాలాంధ్ర-ముసునూరు: ఎంపి గోర్లంట మాధవ్ ,మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఖండిస్తూ శనివారం ముసునూరు మండలకేంద్రమైన ముసునూరులో రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సేక్రటరీ గద్దే రఘుబాబు,రాష్ట్ర బిసి సెల్ టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి మానురాజు సురేష్,నియోజక వర్గ తెలుగుయువత కార్యానిర్వహణ కార్యదర్శి కోండేటి బాబి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడును జైల్లోలో చంపాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. మండల బిసిసెల్ కార్యదర్శి నరిసింహారావు, గద్దల సుహాసిని మోహనరావు,రాపర్ల ప్రతాప్, దేవినేని సాంబయ్య,నక్కా యోహాన్‌పాల్గొన్నారు.

31న జాబ్ మేళా

విశాలాంధ్ర-నూజివీడు: ఆంధ్రప్రదేశ్ ప్రభుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ నిరుద్యోగ యువతకు మేలు చేకూర్చే విధంగా ఈ నెల 31వ తేదీ మంగళవారం నూజివీడునియోజకవర్గం కు సంబంధించి ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాకు నిరుద్యోగ యువత పాల్గొని ఉపాధి అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలియచేసారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో జరిగిన ఒక కార్యక్రమంలో ఉద్యోగ మేళా బ్రోచర్ లను పరిశీలించి కార్యక్రమం విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఇందులో 14 కంపెనీ లు పాల్గొంటున్నాయని తద్వారా 850 మందికి ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని ఏలూరు జిల్లా నైపుణ్య అధికారి గంటా సుధాకర్ వివరించారు. కార్యక్రమంలో విజయ మోహన్, డి ఆర్.డి. ఏ ఎఫ్ వో పార్ధ సారధి, జెడియం కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్, పాల్గొన్నారు.

సీఎం ఆదేశాలను అనుసరిస్తా

విలేకరులతో సూరారెడ్డి

విశాలాంధ్ర - లింగపాలెం : సీఎం జగన్ ఆదేశిస్తే ఆయన ఆదేశానుసారం నడుచుకుంటానని మైత్రీ డవలపర్స్ వ్యవస్థాపకులు, వైసీపీ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి పేర్కొన్నారు. లింగపాలెంలో శనివారం విలేకరుల సమావేశంలో పలు విషయాలు ఆయన వెల్లడించారు. తనకు సీఎం జగన్‌తో ఎంతోకాలంగా తత్సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. తనకు రాజకీయాల పట్ల ఆసక్తి ఉందని, ఆసక్తి ఉన్నా పార్టీలో సామాన్య కార్యకర్తగా ఉంటానని అన్నారు. పార్టీ అధినేత జగన్ ఆదేశిస్తే వార్డు మెంబర్ నుంచి ఎంపీగా నిలబడటానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. అధిష్టానం నిర్ణయాన్ని బట్టే రాజకీయంగా నడుచుకుంటానని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎంపీల మధ్య వర్గపోరు సాగుతున్న పరిస్థితుల్లో మీరు ఎమ్మెల్యేకి మద్దతుగా ఉంటున్నారనే ప్రచారం ఉందని విలేకరులు ప్రశ్నించగా తనకు ఎమ్మెల్యే, ఎంపీ ఇద్దరూ సమానమేనని వీరిలో ఒకరికి తాను మద్ధతు ఇస్తున్నాననే ప్రచారాన్ని నమ్మొద్దని అన్నారు. వ్యక్తులు ముఖ్యంకాదని, పార్టీ ముఖ్యమని అన్నారు. కర్నాటక రాజకీయాల్లో పాల్గొంటారనే ప్రచారం ఉందని ప్రశ్నించగా అటువంటి ఉద్దేశం తనకు లేదని, అక్కడ ఉన్న ఎమ్మెల్యేలు కొందరితో స్నేహం ఉందని అంతే తప్ప వేరే ఆలోచన లేదన్నారు. తాను రాజకీయాలలో ఉన్నా పుట్టిన ఊరు నుంచే రాజకీయాల్లో కొనసాగుతానని అన్నారు.

వైసీపీ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - లింగపాలెం : గడపగడపకు కార్యక్రమం 200 రోజులు పూర్తయిన సందర్భంగా జంగారెడ్డిగూడెంలో ఎమ్మెల్యే ఎలీజా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు లింగపాలెం మండలం నుంచి భారీ సంఖ్యలో బైక్ ర్యాలీతో తరలివెళ్ళారు. మైత్రీ డవలపర్స్ వ్యవస్థాపకులు, వైసీపీ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి ఏర్పాటు చేసిన ఈ ర్యాలీలో మండలం నుంచి అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. లింగపాలెం నుంచి జంగారెడ్డిగూడెం వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీని సూరారెడ్డి పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - లింగపాలెం : ముడిచర్లలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ ఆవిష్కరణ జరిగింది. మైత్రి డవలపర్స్ వ్యవస్థాపకులు, వైసీపీ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి విగ్రహం ఏర్పాటుకు విరాళాన్ని అందించారు. ఈయన చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రావి రమాదేవి కొండయ్య, లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మట్టా సురేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ముళ్ళపూడి సుమన్, నూతలపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులను 100 నుండి 200 రోజులకు పెంచి, రోజు కూలి రూ.600 ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బికేఎంయు) ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పేరంపేట గ్రామ సచివాలయం వద్ద బికేఎంయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సచివాలయ సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కుంచె వసంత రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితి కారణంగా పేద రైతులు,వ్యవసాయ కూలీల పరిస్థితి దయనీయంగా మారిందని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కరువు మండలాలను గుర్తించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి జె.వి.రమణ రాజు మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు లేక రైతులు వేసిన పంటలన్నీ ఎండిపోతున్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని పేద రైతులు, వ్యవసాయ కూలీలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్య దర్శులు కలపాల శ్రీరాములు, గోలిమే బాలయేసు, సభ్యులు శిల్పా రెడ్డి,వెంకట్ రెడ్డి, దొండపాటి లక్ష్మయ్య, ఎడ్లపల్లి వెంకయ్య, జాన్, గట్టియ్య, ఆనందరావు, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట : వర్షాలు లేక రైతులు వేసిన పంటలు ఎండిపోవడంతో రైతులు దిక్కులేని స్థితిలో ఉన్నారని పనులు లేక వ్యవసాయ కూలీలు ఆకలితో అల్లాడుతున్నారని కామవరపుకోట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని ఉపాధి హామీ పథకం పనులు కల్పించి ఆరు

వందల రూపాయలు వేతనం ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు. అనావృష్టి కారణంగా తీవ్ర కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కామవరపు కోట మండల కొండగూడెం సచివాలయం వద్ద సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిద్ది నాగ బాలాజీ, సందమూరి శ్రీనివాసరావు, ఎం. ధర్మయ్య, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో : అనావృష్టి కారణంగా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయని, ప్రభుత్వం కరువు నివారణ చర్యలు చేపట్టాలని సిపిఐ మండల కార్యదర్శి మైసాక్షి

వెంకటాచారి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దాచారం గ్రామంలో రైతులు వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలకు నెలకు రూ.10 వేలు కరువు పెన్షన్‌తో పాటు 35 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కూరాకుల బాబూరావు, వర్స, పాపారావు, వర్స నాగేశ్వరరావు, మడం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ వద్ద అభయ గోల్డ్ కస్టమర్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ధర్నా

విశాలాంధ్ర -ఏలూరు: ఈనెల 30వ తేదీ సోమవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద అభయ గోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ధర్నా నిర్వహిస్తున్నట్లు అభయ గోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ తెలిపారు. శనివారం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ 2008లో విజయవాడ కేంద్రంగా కూకట్ల శ్రీనివాస్ మేనేజింగ్ డైరెక్టర్ గా అభయ గోల్డ్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని స్థాపించారని తెలిపారు. ఖాతాదారుల వద్ద నుండి రోజు, నెలవారి డిపాజిట్లు ద్వారా తక్కువ కాలంలో ఎక్కువ మొత్తాన్ని పొందవచ్చునని విస్తృతంగా ప్రచారం కల్పించి 174 కోట్లు ప్రజల సొమ్మును దోచుకున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 10 జిల్లాలు, తెలంగాణలో 7 జిల్లాలతోపాటు బ్రాంచీలను ఏర్పాటు చేసి 4 లక్షల మంది ఖాతాదారుల వద్ద నిలువు దోపిడీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో బోర్డు తిప్పేయడంతో బాధితులు రోడ్డున పడ్డారన్నారు. అభయ గోల్డ్ ఏజెంట్లు ఖాతాదారులు అందరూ ఐక్యంగా ఏర్పడి అభయ గోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసి వివిధ రూపాలలో ఆందోళన చేసి కేసులు నమోదు చేయగా ప్రభుత్వ అభయ గోల్డ్ ఆస్తులు స్వాధీనం చేసుకుందని, నేటికీ బాధితులకు పరిహారం అందలేదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణం బాధితులకు అసలు, వడ్డీతో కలిపి పూర్తి డిపాజిట్ల చెల్లింపు చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 30వ తేదీ సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయం స్ఫూర్తి భవనం నుండి ర్యాలీగా బయలుదేరి రామచంద్రరావు పేట, ఫైర్ స్టేషన్, జిల్లా పరిషత్ మీద కలెక్టరేట్ వద్ద కు చేరుకుంటుందని ఈ ర్యాలీలో అభయ గోల్డ్ కస్టమర్, ఏజెంట్స్ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఏఎంసీ చైర్మన్‌గా సంపత్ కుమార్

విశాలాంధ్ర తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్పిడి సంపత్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవదాయ ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ గౌరవ చైర్మన్‌గా ఉంటారు. చైర్మన్ గా ముప్పిడి సంపత్ కుమార్, వైస్ చైర్మన్ గా కే.పెంటపాడు గ్రామానికి చెందిన చోడగిరి సత్యనారాయణ (చినబాబు), డైరెక్టర్లుగా సలుమూరి సూర్యప్రకాష్, జాలపర్తి నాగేశ్వరరావు, మద్దుకూరి సుబ్బలక్ష్మి, కండెల్లి వెంకటలక్ష్మి, నీలపాల విజయలక్ష్మి, గోపి కనకదుర్గ, గార్లపాటి వీరకుమార్, షేక్ వల్లి భాష, చినమర్తి వెంకటలక్ష్మి, సబితి లక్ష్మి చంద్ర, నున్న శ్రీనాగలక్ష్మి, దెందుకూరి వెంకట సూర్యనారాయణ రాజు, కర్రి వరహాల రెడ్డిలతో పాటు పెంటపాడు మండలం ముదునూరు సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ ఆఫీసర్, తాడేపల్లిగూడెం అగ్రికల్చర్ ఏడీ, పడాల గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సభ్యులుగా ఉంటారు. ఏడాది కాలం పాటు ఈ పాలకవర్గం పదవీకాలం కొనసాగుతుంది.

రైతు భరోసా కేంద్రాలలో గ్రామసభలు

విశాలాంధ్ర-మండవల్లి: ఖరీఫ్ 2023లో సాగు చేసిన పంటలను ఈక్రాప్ నమోదు ఏవో షేక్‌జరీనా ఆధ్వర్యంలో జరిగింది. ఈకెవైసి వివరాలకు సంబంధించిన తుది జాబితాను సామాజిక తనిఖీలో రైతులు సరిచూసు కొనుటకు మండలంలోని అన్ని గ్రామా ల్లోను ఆర్బికెలలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఇప్పటికే జాబితాలు ప్రదర్శించగా గ్రామ సభలలో రైతులు పాల్గొని అభ్యంతరాలను వ్రాతపూర్వకంగా గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించారు.

IN THE COURT OF THE HON'BLE 1st ADDL.DIST. JUDGE : ELURU, W.G.district

A.S. No. 30/2017

Between:
Konda Radhamma and Another ... Appeallants
And
1.Ambati Srinivas (Died)
2. Vakulabharanam Siripurapu Sobhanagiri and Others ... Respondents

To R-5 : Ambati Kalyan Ram, S/o (Late) Srinivas, R/o Dwaraka Tirumala Village and Mandal, Eluru District.

పై నెంబరు అప్పీలు గ్రంధములో శ్రీ కోర్టువారు 5వ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం పలుమార్లు నోటీసులు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీ యొక్క హాజరు నిమిత్తం ది. 07-11-2023 ఉదయం 10.30 ని॥లకు వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరు ద్వారా గానీ హాజరు కాని యెడల మీ పరోక్షమున పై నెంబరు అప్పీలు గ్రంధము పరిష్కరించబడునని తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 07-11-2023

G.V.Anand Kumar, B.Sc, B.L
Advocate
God's Villa, Opp : Municipal Park,
Eluru, W.G.Dist. A.P.
Cell : 984827001, 989119214

IN THE COURT OF THE HON'BLE 1st ADDL.DIST. JUDGE : ELURU, W.G.district

I.A.No: 462 / 2021 in A.S. No. 30/2017

Between:
Konda Radhamma and Another ... Petitioners/ Appeallants
And
1.Ambati Srinivas (Died)
2. Vakulabharanam Siripurapu Sobhanagiri and Others ...Respondents/ Respondents

To R-5 : Ambati Kalyan Ram, S/o (Late) Srinivas, R/o Dwaraka Tirumala Village and Mandal, Eluru District.

పై నెంబరు పిటీషన్‌లో శ్రీ కోర్టువారు 5వ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం పలుమార్లు నోటీసులు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీ యొక్క హాజరు నిమిత్తం ది. 07-11-2023 ఉదయం 10.30 ని॥లకు వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరు ద్వారా గానీ హాజరు కాని యెడల మీ పరోక్షమున పై నెంబరు పిటీషన్‌ను పరిష్కరించబడునని తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 07-11-2023

G.V.Anand Kumar, B.Sc, B.L
Advocate
God's Villa, Opp : Municipal Park,
Eluru, W.G.Dist. A.P.
Cell : 984827001, 989119214

రైతాంగాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర-చింతలపూడి: పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపి రైతు సంఘం ఏలూరు జిల్లా కన్వీనర్ రాయంకుల లక్ష్మణరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఉర్లగూడెం, కనిపిడిబాల వారి గూడెం, తదితర గ్రామాలలో ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో నష్టపోయిన పంటలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో వర్షాభావంతో వేసిన పంట ఉర్లగూడెం,కనిపిడి బాల వారి గూడెం గ్రామాల్లో 250 ఎకరాలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. సాగు చేసిన రైతులు ఆర్థికంగా ఎకరాకు రూ.25వేలు పెట్టుబడి పెట్టి పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంటనష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం తక్షణమే వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టాన్ని నమోదు చేసి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ,రైతు నాయకులు తక్కెలపాటి ప్రసాద్, తాడిగడప మాణిక్యాలరావు. ఎస్ కే జానీ తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర -చింతలపూడి: ఏఐటియుసి 104వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఏఐటియుసి చింతలపూడి ఏరియా అధ్యక్షులు తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశం పి. మల్లేశ్వరి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న తొర్లపాటి బాబు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రానికి పూర్వమే ఏర్పడిన ఏఐటియుసి ఆనాడు కార్మిక హక్కులతో పాటు భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని కోరిన ఏకైక కార్మిక సంఘం ఏఐటియుసి అన్నారు. ఆనాడు కార్మిక వర్గాన్ని స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామ్యం చేయడంలో ఏఐటియుసి కృషి అనిర్వచనీయం అన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా కార్మిక వర్గం సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మతోన్మాద బిజెపి ప్రభుత్వం వాటిని రద్దుచేసి 4 లేబర్ కోడ్ లు గా తీసుకువచ్చి కార్మిక వర్గానికి తీరని నష్టం కలిగించిందని విమర్శించారు. ఈనెల 31వ తేదీ స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద ఎబిటీయుసి ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నామని దీనిని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు గంధం అంజమ్మ, విజయలక్ష్మి, అప్పారావు, వెలగాడి అనురాధ, ఎస్ కే యాకు హెూలీ, సిపిఐ మండల కమిటీ సభ్యులు దొంతా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో రైతు సంఘాల మహా ధర్నా

విశాలాంధ్ర -భీమవరం: ఢిల్లీలో రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై 500 పైగా రైతు సంఘాలు 13 నెలలు పాటు చేసిన ఆందోళన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 27, 28వ తేదీల్లో విజయ వాడలో మహా ధర్నా జయప్రదం చేయాలని రైతు సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. సిఐటియు కార్యాలయంలో తెలుగు రైతు నాయకులు తమ్మినీడి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రైతులకు హామీలిచ్చి మోసం చేసిన మోడీ ఇంటికెళ్ళక తప్పదని హెచ్చరించారు. మహా ధర్నా నేపథ్యంలో నవంబర్ రెండవ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరంలో ఆనంద ఫంక్షన్ హాల్లో జరిగే రైతు సంఘాల సమన్వయ సదస్సుకు సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు విచ్చేస్తారని యావత్ రైతాంగం పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. న్యూస్ క్లిక్ ఎడిటర్ తదితరులపై పెట్టిన ఎఫ్ఐఆర్ లో రైతు ఉద్యమానికి విదేశీ నిధులు అందించారని మోడీ సర్కారు కేసు నమోదు చేసిందని దాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో నవంబర్ 6వ తేదీన ఎఫ్ఐఆర్ కాపీలు దగ్ధం చేయాలని నాయకులు కోరారు. సమావేశంలో ఎఐటి యుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు లంకా కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు దండు శ్రీనివాసరాజు, సంయుక్త కిసాన్ మోర్చా పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ కన్వీనర్ ఆకుల హరే రామ్, తెలుగు రైతు టౌన్ అధ్యక్షులు పాల శ్రీరామదాసు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జె ఎన్ వి గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో 3,661 ఓపీ

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద శనివారం 8 గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష లో శనివారం సాయంత్రం గం. 6వరకు 3 వేల 661 ఓపి నమోదైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. శర్మిష్ట తెలిపారు. వీరిలో మహిళలు 1,926 మంది కాగా పురుషులు 1735 మంది వున్నారు.ఆరోగ్య పరీక్షల అనంతరం 47 మందికి మెరుగైన వైద్యం కోసం ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలున్న 3,661 మందికి ఉచితంగా మందులు అందించామన్నారు. కంటి వెలుగు శిబిరంలో 560 ఓపి నమోదైంది.

విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: నవంబర్ 8వ తేదీన విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం , కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలనే డిమాండ్స్ పై రాష్ట్ర వ్యాప్తంగా జరిగే విద్యా సంస్థల బంద్‌ను జిల్లాలో జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ , పి.డి.ఎస్.యు, ఎఐవైఎఫ్, డివైఎఫ్ఐ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు శుక్రవారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సి హెచ్ సుందర్ అధ్యక్షతన బంద్ జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం కోసం 32 మంది విద్యార్థులు తమ ప్రాణాలు అర్పించినారని అలాంటి ఉక్కు కర్మాగారం ప్రవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా ఆలోచిస్తుందని దీనికోసం జరిగే ఉద్యమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ చేయొద్దని, రాష్ట్రంలో వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు వివిధ రూపాలలో చేస్తున్న ఉద్యమాలు నవంబర్ 8కి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా ఆ రోజు జిల్లా లో అన్ని కేజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థలు బంద్ కు విద్యార్థి యువజన సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. పి.డి.ఎస్.యు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి సి హెచ్ నాగరాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కుతో పాటు కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.పవన్, ఎఐఎస్ఎఫ్ నాయకులు గంటా పవన్ , అర్.మనిదీప్ ,ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు ,టి.ప్రసాద్ , జీ.గణేష్ , పి డి యస్ యు జిల్లా అధ్యక్షుడు ఎం.రూపాశంకర్ ,ఎన్.శ్రీను, ఎం.తేజ, యు.అభి , పుల్లూరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

విశాలాంధ్ర - ముదినేపల్లి : గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని కొర్రగుంటపాలెంలో రూ.49.60 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని, పలు సిసిరోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య భరోసా ఇచ్చింది వైసీపీ ప్రభుత్వమే అన్నారు. అవసరమైన శస్త్రచికిత్సలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటిని ఏఎన్ఎంలు సందర్శించి ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలున్న వారిని వైద్యశిబిరాలకు హాజరయ్యేలా చూసి వ్యాధి తీవ్రతను బట్టి ఆరోగ్యశ్రీ ద్వారా పెద్ద ఆరోగ్యశాలలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ , రాష్ట్ర రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య , సర్పంచ్ పేరే రామకృష్ణ , పిఏసిఎస్ అధ్యక్షులు అచ్యుత రాంబాబు, వైస్ ఎంపీపీ చొప్పర్ల సునీత , రాసూరి రాధ , డిఎల్పిఓ పూర్ణచంద్రరావు, కార్యదర్శి ప్రభుకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం

- జిల్లా రెవిన్యూ అధికారి కె. కృష్ణవేణి

విశాలాంధ్ర-భీమవరం: వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం, స్ఫూర్తి దాయకం అని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణ వేణి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి ముఖ్య అతిథిగా పాల్గొని, వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కె.కృష్ణ వేణి మాట్లాడుతూ రామాయణం వంటి మహా గ్రంథాన్ని మనకు అందించిన వాల్మీకి మహర్షి చిరస్మరణీయులని కొనియాడారు. రామాయణం మన జీవన విధానానికి ఒక మార్గమని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ధర్మమే గెలుస్తుందని చెప్పడానికి రామాయణం ఒక నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి వి ఆర్ కె ఎస్ ఎస్ గణపతి రావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె. శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గణపవరం విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు గణపవరం జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం. పద్మావతి తెలిపారు. శనివారం గణపవరం హైస్కూల్‌లో నిర్వహించిన పోటీలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2023-24 సంవత్సరానికి, యు-14 , యు-17 విభాగాల్లో బాలబాలికలకు సాఫ్ట్ టెన్నిస్ పోటీలు నిర్వహించినట్టు ఆమె తెలిపారు. నవంబర్ 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు పిఠాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనటానికి అర్హత సాధించినట్లు తెలిపారు. గణపవరం హైస్కూల్ నుండి పదిమంది బాలురు, ఎనిమిది మంది బాలికలు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన పిడి పద్మావతిని ఎంఈఓలు పుచ్చల శేషు, జి. బాలయ్య, హెచ్ఎం ఎంఎస్ వివిఎన్ మూర్తి, దేవదాసు మాస్టారు, స్కూల్ సిబ్బంది అభినందించారు.

పిహెచ్‌సి వైద్యురాలికి పదోన్నతి

విశాలాంధ్ర-మండవల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మేరీ కేథరిన్ ఏలూరు జిల్లా కెఆర్‌పురం డిప్యూటీ డిఎంహెచ్‌వోగా ప్రమోషన్‌పై వెళ్లారు. శనివారం మండవల్లి ఆరోగ్య కేంద్రంలో సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన కేథరిన్ అభినందన సభ జరగగా వైద్యురాలు అనీలతో పాటు పిహెచ్‌సి అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి నేత మెండా సురేష్‌బాబు ఉన్నారు.

వివాదరహిత గ్రామంపై న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర-పెదపాడు : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి బులి కృష్ణ శనివారం పెదపాడు మండలంలోని గోగుంట గ్రామంలో వివాద రహిత గ్రామం అనే అంశం పైన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోగుంట గ్రామంను వివాద రహిత గ్రామంగా చేసేందుకు ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గ్రామంలో ఏ విధమైన వివాదాలున్నా వాటిని తక్షణం పరిష్కారానికి కృషి చేస్తామని, ఏమైనా కేసులు ఉన్న ప్యానల్ లాయర్ ద్వారా మధ్యవర్తిత్వం నిర్వహించి రాజీ చేసి, గ్రామాన్ని వివాదరహిత గ్రామంగా ప్రకటించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల తహసీల్దార్ జి. విజయకుమార్, మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ యస్.నరసింహమూర్తి, ఎంపీడీవో సూర్య కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రమణ, పెదపాడు ఎస్ఐ చల్లా కృష్ణ, న్యాయవాదులు , ఇతర రెవెన్యూ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

భవిష్యత్తు గ్యారంటీ లబ్ధిదారులను గుర్తించండి

విశాలాంధ్ర -భీమవరం: నవంబర్ 1వ తేదీ నుండి జనసేనపార్టీ నాయకులతో కలసి క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్చార్జిలు తమ బూత్ పరిధిలోని భవిష్యత్తు గ్యారెంటీ లబ్ధిదారులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు.భీమవరం నియోజకవర్గ భవిష్యత్తు గ్యారెంటీ అవగాహన సదస్సును క్లస్టర్ యూనిట్,బూత్ ఇన్చార్జిలకు జిల్లా టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇదే సందర్భంలో భవిష్యత్తు గ్యారంటీ లబ్ధిదారులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ వైసిపి ముఖ్యమంత్రి జగన్ టిడిపి అధినేత చంద్రబాబును ఏదోరకంగా అరెస్టుచేసి జైల్లో ఉంచితే టిడిపి నాయకులు కార్యకర్తలు తనకు లొంగిపోతారు అనుకోవడం అవివేకమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, నాయకులు రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, క్లస్టర్, యూనిట్,బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరామర్శించిన జనసేన ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామనికి చెందిన వంగపండు నాగరాజు ఇటీవలే యాక్సిడెంట్ కారణంగా గాయాల పాలయ్యారు. శనివారం ఆయనను పరామర్శించిన ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు,ఆయనతో పాటు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు వాకుమూడి ఇంద్ర కుమార్, నిమ్మల ముఖేష్, నిమ్మల దుర్గా ప్రసాద్, తాటిపర్తి జీవ, కౌరు రవి, అడపా త్రినాథ్, కర్నాటి మురళీ, ఉత్తరిల్లి చందు, మణికంత, మద్దాల వర్మ, సుబ్రహ్మణ్యం, గ్రామ జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైసీపీ హవా

నూజివీడు ఎంఎల్‌ఏ ప్రతాప్

విశాలాంధ్ర-చాట్రాయి: రాష్ట్రంలో జగన్ గాలి వీస్తోందని చంద్రబాబు ఎన్ని నాటకాలడినా మళ్ళీ జగనే ముఖ్యమంత్రి అవుతారని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు విశ్వాసం వ్యక్తం చేశారు. శనివారం మండలం లోని బూరుగగూడెం గ్రామంలో మళ్ళీ జగనే ఎందుకు కావాలంటే అనే అంశంపై జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు 650వాగ్దానాలు చేసి 3వాగ్దానాలు కూడా అమలుచేయలేని నాయకుడని అన్నారు. టిడిపి రాజ్యసభ సభ్యులను చంద్రబాబే బిజెపి లోకి పంపి దొంగాటలాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు మిద్దె బాలకృష్ణ, వైసిపి నాయకులు దామెర ప్రసాద్ బాబు, చెలికాని బాబ్జి, పుచ్చకాయల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చూట్ దొర విగ్రహం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - ఆకివీడు : ఆకివీడు పంచాయతీకి మొట్టమొదటి సర్పంచ్ చూట్ దొర అని ఇప్పుడు ఆకివీడు నడిబొడ్డులో ఉన్న దొర గారి చెరువు ఆయన పేరు మీదే ఉందని అందు వలన దొరగారి చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా అక్కడ చూట్ దొర విగ్రహాన్ని నిర్మించాలని కోరుతూ ఆకివీడు మండల క్రిస్టియన్స్ ఆధ్వర్యంలో నగర్ పంచాయతీ కమిషనర్ కృష్ణ మోహన్, నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి లకు వినతి పత్రం అందజేశారు. క్రిస్టియన్ కమ్యూనిటీకి స్థలాన్ని కేటాయించి షాపులు నిర్మాణం కూడా చేసే విధంగా నగర పంచాయతీ అధికారులు, పాలకవర్గం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి 15 అంశాల కార్యక్రమం క్రిస్టియన్ మైనారిటీ సభ్యులు బిషప్ ప్రసాద్ రాజు, సిబిసిఎన్‌సి సెక్రటరీ జి. జోసెఫ్ రాజు, నగర పంచాయతీ కోఆప్షన్ సభ్యులు సావిత్రమ్మ తోపాటు క్రిస్టియన్ మహిళలు , సంఘస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులు

విశాలాంధ్ర-ఏలూరు: అవసరత కలిగిన దివ్యాంగులకు కృత్రిమ చేతులు అమరిక ఎల్లెస్ మెడోస్ ప్రోస్థటిక్ హ్యాండ్ ఫౌండేషన్ వారి సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరివారి ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ చేతులు తయారుచేసి ఉచితంగా ఇవ్వబడతాయని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ,సహాయ సంచాలకులు,జి.సి.హెచ్. ప్రభాకర్ తెలిపారు. కృత్రిమ చేతులు తయారు చేయించు కొనుటకుసుమారు రు.36వేలు దాకా ఖర్చు అవుతుందని అయితే వాటిని అధునాతన పద్ధతిలో తయారు చేయబడి, ఉచితముగా పంపిణీ చేయబడే ఈ శిబిరానికి, అవసరం అయిన దివ్యాంగులు మోచేయి క్రింద కనీసం నాలుగు అంగుళాలు చేయి గల దివ్యాంగులు మొబైల్ నెంబరు 72074 03150 నకు ఫోను చేసి రిజిస్ట్రేషన్ చేయించుకో వలసినదిగా, ఉచితముగా పొంద వలసినదిగా కోరారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అవసరం అయిన దివ్యాంగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకో వలసినదిగా ప్రభాకర రావు కోరారు.

ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని చింతలపూడి ఎమ్మెల్యే వి.ఆర్.ఎలిజా అన్నారు.శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారంతో 200 వ రోజుకు చేరుకోవడంతో సందర్భంగా స్థానిక గంగానమ్మ గుడి సెంటర్లో ఎమ్మెల్యే ఎలిజా ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ముందుగా మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసి యున్న శ్రీమద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే ఎలిజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం నుండి జంగారెడ్డిగూడెం పట్టణంలోని గంగానమ్మ గుడి సెంటర్ వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే ఎలిజా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఇంటికి ఎమ్మెల్యేలను వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించడంతో 200 రోజులపాటు నిత్యం ప్రజల్లో ఉంటూ నియోజకవర్గం లోని అన్ని మండలాలలో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో మళ్ళీ జగనన్న ప్రభుత్వం వస్తుందని అందుకు ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే ఎలీజా కోరారు.ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పోల్నాటి బాబ్జి, మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం చైర్పర్సన్ కీసరి సరితా రెడ్డి ,ఎంపీపీ కొదమజ్యోతి,పట్టణ వైసీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంబంధం లేకుండా రైతులకు మద్దతు ధరను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించారని గత సంవత్సరం నుండి కూడా అమల్లో ఉందని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. శనివారం గణపవరం మండలం చిలకంపాడు (సిహెచ్ అగ్రహారం) గ్రామంలో 2023 ఖరీఫ్ సీజన్ పురస్కరించుకుని రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. రైతులు మధ్య దళారీల చేతిలో పడకుండా నేరుగా రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసుల రాజు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, డి ఎం సివిల్ సప్లై అధికారి శివరాం ప్రసాద్, డి.ఎస్.ఓ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

రాజమహేంద్రి స్కూల్లో ఘనంగా ప్రారంభమైన అంతర్ జిల్లాల ఎస్జిఎఫ్ రైఫిల్ షూటింగ్ పోటీలు

విశాలాంధ్ర - రాజానగరం : విద్యార్థులు,క్రీడాకారులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడానికి అంకిత భావంతో కృషి చేయాలని డివైఈవో ఈ.నారాయణ అన్నారు. మండలంలోని సంపతనగరం గ్రామంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ పాఠశాల ప్రాంగణంలో తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల 67వ ఎస్జిఎఫ్ రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ పోటీలను డివైఈవో నారాయణ శనివారం ప్రారంభించారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు రైఫిల్‌తో లక్ష్యాన్ని షూట్ చేశారు. .రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టి.కె.విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 67వ అంతర్ జిల్లా ఎస్జిఎఫ్ రైఫిల్ షూటింగ్ పోటీలు తమ విద్యాసంస్థల్లో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే నెల 18,19 రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జరిగేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్జిఎఫ్ క్రీడా పోటీల కార్యదర్శి ఎస్.ఆర్.కె.వి.స్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 500 మంది క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు హాజరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్స్ భీమిరెడ్డి నాగేంద్రుడు,కప్పల వరలక్ష్మి, జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, తదతరులు పాల్గొన్నారు.

సిఎస్ఐఆర్, సిఎఫ్టిఆర్ఐ తో నన్నయ్య ఎంవోయూ

విశాలాంధ్ర - రాజానగరం : కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సిఎస్ఐఆర్) సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సిఎస్ఐ ఆర్) మైసూరుతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయా నికి అవగాహన ఒప్పందం కుదిరిందని నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన ఎంవోయూ కార్యక్రమానికి నన్నయ ఉపకుల పతి ఆచార్య కె.పద్మరాజు తో పాటు డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య తోలేటి జానకిరామ్, సిఎస్ఐఆర్, సిఎఫ్టిఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణ సింగ్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ ఆచార్య పి.రామకృష్ణ, ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల, డీన్ ఫ్యాకల్టీ సైన్సెస్ ఆచార్య వై.శ్రీనివాసరావు, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగాధిపతి డా.డి.కళ్యాణి లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ మైసూర్ లోని సి.ఎఫ్.టి.ఆర్.ఐ. వంటి ప్రముఖ సంస్థలలో ఎంవోయు ద్వారా రెండు సంవత్సరాల ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సుకు మార్గనిర్దేశం చేయడం, ప్రోగ్రామ్ రూపకల్పన కోసం నిపుణులను బి.ఓ.ఎస్ కి నామినేట్ చేయడం, అతిథి ఉపన్యాసాలను నిర్వహించడం,చెల్లింపు ప్రాతిపదికన విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్‌ను ఆఫర్ చేయడం వంటి ప్రయోజనాలు అందుతాయన్నారు. అలాగే ఆదికవి నన్నయ యూనివర్సిటీ బాధ్యతలు గా ప్రాంతీయ సాంప్రదాయ ఆహారాలు మరియు ముడి పదార్థాలపై సర్వేలు నిర్వహించడం, సాంప్రదాయ మరియు ఇతర ఆహార పదార్థాల ప్రాసెసింగ్‌పై డేటా సేకరణ, వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు మొదలైన వాటి ద్వారా ఈ ప్రాంతంలో ఫుడ్ సైన్స్ వాటి సాంకేతికతలను ప్రోత్సహించడానికి మౌలిక సదుపాయాలు మరియు ఇతర సహాయాన్ని అందిస్తామన్నారు.2024లో 9 మిలియన్స్ ఉద్యోగావకాశాలు ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తాయని ప్రముఖ పత్రిక ప్రచురణలను ఉదహరిస్తూ చెప్పారు. ఆదికవి నన్నయ వర్సిటీ అందిస్తున్న ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా వర్సిటీ వీసిలు,అధికారులు ప్రసంగించారు.

వయోవృద్ధుల సంక్షేమానికి జిల్లా కమిటీ సేవలు అందించాలి

విశాలాంధ్ర-భీమవరం: వయోవృద్ధుల సంక్షేమానికి జిల్లా కమిటీ ఉత్తమ సేవలు అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి అన్నారు.జిల్లా కలెక్టరేట్ స్పందన సమావేశం మందిరంలో జిల్లా వయోవృద్ధుల నూతన కమిటీ తొలి సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవిన్యూ అధికారి పాల్గొన్నారు. తొలుత జిల్లా కమిటీ సభ్యులు పరిచయ కార్యక్రమం జరిగింది. అనంతరం జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ నూతన జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమానికి జిల్లా కమిటీ ఏర్పాటు చేసుకొవడం మంచి శుభసూచకం అన్నారు. క్రమం తప్పకుండా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాలు జరుగుతాయని, అందరు హాజరై వయోవృద్ధుల సంక్షేమానికి మంచి సేవలు అందించాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వయోవృద్ధుల సంక్షేమం అప్పిలైట్ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 2007 వయోవృద్ధులు, తల్లిదండ్రులు రక్షణ పోషణ చట్టం ప్రకారం ప్రతీ బాధిత వృద్ధతల్లిదండ్రులకు సెక్షన్ 22/2 ప్రకారంవారి ఆస్తులకు, వారికి రక్షణ కల్పించవలసి ఉన్నదని, దీనికి పోలీస్ శాఖవారి సహకారం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రైనీ కలెక్టరు కానాల సంగీత్ మాథుర్, ప్రతిభావంతులు సంక్షేమ సహాయ సంచాలకులు జిసిహెచ్ ప్రభాకర్, డిసిహెహెచ్ ఎస్ డాక్టర్ పి. సూర్యనారాయణ, డాక్టర్ సుగుణ రాజు, నరసాపురం ఆర్డీవో కార్యాలయం ఏవో యన్. వెంకటేశ్వరరావు, కన్సిలియేషన్ అధికారులు డి.వెంకట సురేష్ చంద్రాజీ, డాక్టర్ ఎం. వెంకటేశ్వర రావు, ప్రత్యేక ఆహ్వానితులు వెంపరాల నారాయణమూర్తి, కె. రామ చంద్రరావు, మెంబర్లు యం.కేశవోలు, బోణం పాండురంగ రావు,యం పుష్పాంజలి, ఎ. నాగ సూర్య సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర - శంఖవరం : అర్హత కలిగిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని శంఖవరం తహసీల్దార్ కే సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం శంఖవరం తహసీల్దార్ బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నవంబరు 4, 5 తేదీలు డిసెంబరు 2,3 తేదీలలో ప్రత్యేక ప్రచార రోజులుగా పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని 1.1.2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కు నమోదు చేయించు కునేలా ప్రచారం కల్పించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఓటు నమోదు కొరకై పత్రాలు బిఎల్ఓ వద్ద ఉంటాయని వారిని సంప్రదించి నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రేవతి తదితరులు పాల్గొన్నారు.



సూర్యచంద్రలో శాటిలైట్లపై అవగాహన

విశాలాంధ్ర - సీతానగరం: సూర్య చంద్ర ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శనివారం స్పేస్ సెంటర్ శాటిలైట్ మానిటరింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో శాటిలైట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ మామిడి సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇస్రోలో జరిగే ప్రయోగాల గురించి, చంద్రయాన్ విజయవంతం అవ్వడానికి కారణాలను విద్యార్థులకు వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చిరు శాస్త్రవేత్త మామిడి సతీష్‌ను పాఠశాల చైర్మన్ కనిక రెడ్డి, కరస్పాండెంట్ లక్ష్మీ ప్రసన్న శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఫణీంద్ర, ఇంచార్జి రామకృష్ణ, ఏవో సుమంత్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సౌందర్య లహరి పారాయణం

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో ఆశ్వీజయ పూర్ణిమ సందర్భంగా శనివారం నాడు సౌందర్య లహరి పారాయణం జరిగింది. పూర్ణిమ పర్వదినం పురస్కరించుకుని ఉదయం మహాలక్ష్మి సరస్వతి వినాయకుడు ఆదిశంకరాచార్యులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగద్గురు ఆదిశంకరాచార్యులు రచించిన సౌందర్యలహరి 100 శ్లోకాలను పఠించారు. జగద్గురు ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం మహిళ కమిటీ సభ్యులు సౌందర్యలహరి పారాయణం నిర్వహించారు. సౌందర్య లహరి పారాయణ మహిళా సభ్యులు నారాయణ లక్ష్మీ రాణి కరుటూరి సత్యవాణి ఉప్పలపాటి పద్మ చావా సునీత ఉప్పలపాటి ప్రసన్న కొండపల్లి శ్రీ లక్ష్మి చిరపూరి బేబీ స్వర్ణ దుర్గ వెలగా సుబ్బలక్ష్మి గద్దె మురళి కుమారి వెలగా బేబీ తదితరులు దాదాపు రెండు గంటలపాటు సౌందర్య లహరి పారాయణ చేశారు ఆలయ కమిటీ సభ్యులు చలంచర్ల హరినాథ్ తోట సత్యనారాయణ నారాయణ విశ్వేశ్వరరావు చిరావూరి సత్యనారాయణ గౌరవ సలహాదారు విష్ణుభట్ల రామారావు విశేష సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తణుకులో ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మాల ఐక్యవేదిక తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం తణుకులో నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనానికి మండల ప్రజలు భారీగా తరలిరావాలని మాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు తిర్రే రవిదేవా శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా మాల సోదర సోదరీ మణులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హాజరవ్వాలని ఆయన కోరారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణం, హౌసింగ్ బోర్డ్ కాలనీ అంబేద్కర్ భవనం లో నిర్వహించనున్న ఈ ఆత్మీయ సమ్మేళనానికి మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అద్దంకి దయాకర్, అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు జివి హర్ష కుమార్, సమత సైనిక్ దళ్ సౌత్ ఇండియా అధ్యక్షులు షాన్ రెంజర్ల రాజేష్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు అన్నవరపు కిషోర్, ఆంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు సిద్ధాంతల కొండబాబు, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అలగా రవికుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

బలుసుతిప్ప రోడ్డు పనులకు భూమి పూజ

విశాలాంధ్ర - కాట్రేనికోన : పల్లంకుర్రు నుండి బలుసుతిప్ప వెళ్లే ప్రధాన రహదారిని కోటి 30 లక్షలతో రోడ్డును ఆధునికరించే పనులకు శనివారం అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు, శాసనసభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ శంకుస్థాపన చేసారు. గ్రామీణ ప్రాంతంలో రహదారి సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నేల కిషోర్ కుమార్, మండల అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి, తూర్పు డెల్టా చైర్మన్ యేడిద చక్రపాణి రావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - పెద్దాపురం : ప్రతీ ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని జె తిమ్మాపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సుభాని అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతీ ఇంటికి వెళ్ళి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీనేనన్నారు. జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత హౌసింగ్ చైర్మన్ దొరబాబు రిబ్బన్ కట్ చేసి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళీ,నల్లల గోవిందు, గోలి రామారావు, పెంటా విజయ్ కుమార్, గంగరాజు, శేషారావు, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలో ప్రత్తిపాడు సిహెచ్సిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రత్తిపాడు సిఐ ఎం. శేఖర్ బాబు ప్రారంభించారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం, రౌతులపూడి, పోలీస్ స్టేషన్ల సబ్ ఇన్స్పెక్టర్‌లు మరియు పోలీస్ సిబ్బంది తదితర యువకులు సుమారు 80 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సిఐ శేఖర్ బాబు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలు మేరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్‌లో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఎం. పవన్ కుమార్, జి. సతీష్, అబ్దుల్ నబి, కిషోర్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యానికి రక్ష జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - నిడదవోలు : కుటుంబంలోని అందరి ఆరోగ్యానికి రక్ష జగనన్న ఆరోగ్య సురక్ష అని మండల పరిషత్ ప్రజా పరిషత్ చైర్మన్ తిరుమళ్ళ భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రావిమెట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష తో రోగుల ఇంటి వద్దకే వైద్యులు వచ్చి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఎంతో ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని పేదల చెంతకు చేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ కే దక్కుతుందన్నారు. శిబిరంలో 540 రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కోయ్యే సూరిబాబు, సర్పంచ్ కాల్దారి విజయలక్ష్మి, ఎంపీటీసీ ఉప్పులూరి తేజశ్రీ, సొసైటీ అధ్యక్షులు యాళ్ల రామారావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ జె.సంధ్య. జనరల్ సర్జన్ వినీల్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - గండేపల్లి : సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవిశంకర్ 60వ పుట్టినరోజు పురస్కరించుకొని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగానికి చెందిన విద్యా ర్థులు క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తమ పుట్టిన రోజు పెళ్లి రోజు తదితర ప్రత్యేక దినాలలో పర్యావరణ హితంగా మొక్కలు నాటడం అలవాటు చేసుకుని ప్రకృతి పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆదిత్య కన్స్ట్రక్షన్ విభాగం డైరెక్టర్ మేడపాటి భాస్కర చంద్రా రెడ్డి మాట్లాడుతూ మూడు దశాబ్దాల పైబడి ఫార్మసీ ఉపాధ్యాయుడుగా ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి, పలువురు పిహెచ్‌డి అభ్యర్థులకు గైడ్‌గా మార్గనిర్దేశం చేసి, ఫార్మా రంగంలో విద్యార్థులకు విలువైన పుస్తకాలు అందించిన రచయితగా గుర్తింపు పొంది పుస్తకాల ద్వారా వచ్చిన ధనాన్ని మదర్ తెరీసా సంస్థకు చెందేలా విరాళంగా ఇచ్చిన గొప్ప దాత డాక్టర్ రవిశంకర్ అని కొనియాడారు. డాక్టర్ రవిశంకర్ మరిన్ని వసంతాలు ఆయుఃఆరోగ్యాలతో జీవించాలని కోరుతూ ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్. సతీష్ రెడ్డి, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ఎం శ్రీనివాసరెడ్డి, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ దోలా సంజయ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, ఆదిత్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి సతీష్ కుమార్, గ్లోబల్ బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్‌సంజయ్ కుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌టివివిఎస్ కుమార్, ఆదిత్య కన్స్ట్రక్షన్ విభాగం డైరెక్టర్ మేడపాటి భాస్కర చంద్రారెడ్డి, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయే తర సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

రాజమండ్రిలో గోల్డ్ పాయింట్ సెంటర్‌ను ప్రారంభించిన ముత్తూట్ ఎగ్జిమ్

విశాలాంధ్ర-రాజమండ్రి: భారీ వ్యాపార సమ్మేళనం ముత్తూట్ పప్పచన్ గ్రూప్ యొక్క విలువైన లోహపు విభాగం, ముత్తూట్ ఎగ్జిమ్ (పీ) లిమిటెడ్, తమ నూతన కేంద్రం ను రాజమండ్రి లోని కోటిపల్లి బస్టాండ్ టీ నగర్ వద్ద జీ ఎస్ రావు కాంప్లెక్స్ లో కొత్త ముత్తూట్ గోల్డ్ పాయింట్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ గోల్డ్ పాయింట్ సెంటర్ రాష్ట్రంలో ముత్తూట్ ఎగ్జిమ్ ప్రారంభించిన మూడవ సెంటర్ అవుతుందని ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. వినియోగదారులకు తమ బంగారాన్ని విక్రయించడానికి విశ్వసనీయమైన నమ్మకమైన కేంద్రాన్ని అందించాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేసామన్నారు. ఇక్కడ వినియోగదారులు తమ బంగారాన్ని సౌకర్యవంతమైన, పారదర్శక విధానము లో విక్రయించవచ్చునని, ఈ కొత్త బ్రాంచ్‌తో, కంపెనీ ఈరోజు భారతదేశంలో 18 గోల్డ్ పాయింట్ సెంటర్‌లను కలిగి ఉందన్నారు, ఇందులో రెండు 'మొబైల్ ముత్తూట్ గోల్డ్ పాయింట్' సెంటర్లు కూడా వున్నాయని, ఇవి కస్టమర్ల ఇంటి నుండి బంగారాన్ని సేకరిస్తాయని, ముత్తూట్ ఎగ్జిమ్, తమ గోల్డ్ పాయింట్ సెంటర్‌ల ద్వారా, పాత ఉపయోగించిన బంగారు వస్తువులను నేరుగా వినియోగదారుల నుండి కొనుగోలు చేస్తాయని తెలిపారు.

ఉమ్మిడివారిపాలెంలో బాబుతో నేను

విశాలాంధ్ర-పెరవలి : శనివారం బాబుతో నేను అనే కార్యక్రమంలో బాగంగా పెరవలి మండలం ఉమ్మిడివారిపాలెంలో ఇంటి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ గురించి నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతికాల రామకృష్ణమ్మ (శ్రీను) వేండ్ర వెంకట రామ్మూర్తి, చెన్నంశెట్టి శ్రీను, నల్లా సురేంద్ర, అక్కిన గంగాధరరావు, సలాది కృష్ణమూర్తి, సిరిగినీడి శేషగిరిరావు, రేలంగి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

విశాలాంధ్ర -పెరవలి :మండలంలోని కొత్తపల్లి నల్లాకులవారి పాలెం గ్రామాలకు సంబంధించి పెరవలి జాతీయ రహదారి ప్రక్కన ఉన్న నల్లాకుల వారి పాలెం ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆవరణలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పెరవలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కార్చెర్ల సీతారాం ప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల లక్ష్యమని, దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈశిబిరంలో వైద్యులు విజయ్ కుమార్, హేమరాజు స్వాగత్, రవికుమార్ వైద్య సిబ్బంది రమణమూర్తి ఎన్ఆర్ జె జాన్ మిల్టన్ సచివాలయ సిబ్బంది అంగన్వాడి ఆశావర్కర్లు సహాయ సహకారాలు అందించారు.ఈ కార్యక్రమంలో వీరమల్ల సత్యనారాయణ నక్క పాలేశ్వరరావు పాలా వెంకటేశ్వరరావు పాల పద్మ పిల్లా శ్రీనివాస్ కొర్ల ఉదయభాస్కరరావు బాలాజీ గ్రామపంచాయతీ మెంబర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ జి. లోవరాజు అధ్యక్షతన "జగనన్న ఆరోగ్య సురక్ష" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ ముందుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాలంకరణ చేశారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రతి ఇంటికి నేరుగా వైద్య సిబ్బందిని పంపించి వైద్యపరమైన టెస్టులు చేయించి మందులు ఇవ్వడం గొప్ప విషయమని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ గొల్లల వీధి సచివాలయం పరిధిలో 4, 5, 6, వార్డు ప్రజలకు సంబంధించి 350 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి. చిట్టి రాజు, కౌన్సిలర్స్ బొంతు సత్య శ్రీనివాస్, అబ్బ దాసుల శ్రీనివాసరావు, ములపర్తి బాలకృష్ణ, రెడ్డి హేమ సుందరి పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు

100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ డాక్టర్ ప్రేమ్ కాజల్ ఆదేశాల ప్రకారం స్థానిక ప్రత్తిపాడు సెబ్ స్టేషన్ పరిధిలో గల కిర్లంపూడి మండలంలో గెద్దనాపల్లి, తామరాడ గ్రామాల్లో నాటు సారాయి స్థావరాలు, అమ్మకందారులపై విస్తృతంగా దాడులు చేసారు. గెద్దానపల్లి గ్రామంలో నాటు సారాయి తయారీ సిద్ధంగా ఉంచిన 100 లీటర్లు పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 లీ. నాటు సారా స్వాధీనం చేసుకుని గెద్దనాపల్లి గ్రామానికి చెందిన సుందరపల్లి శ్రీను అనే వ్యక్తిపై పరారీ కేసు నమోదు చేసారు. తామరాడ గ్రామంలో పాత సారాయి కేసులో పరారీ ముద్దాయిగా ఉన్న చక్రవర్తుల గోపాలస్వామి అలియాస్ వీరబాబును అరెస్టు చేసారు. గంజాయి నిర్మూలనకు పరివర్తన 2.0పై గ్రామ ప్రజల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ దాడుల్లో పరివర్తన కార్యక్రమంలో డీటీఫ్ సెబ్ ఇన్స్పెక్టర్ బి. వెంకటేశ్వరరావు, సిబ్బంది స్థానిక ప్రత్తిపాడు సెబ్ సబ్ ఇన్స్పెక్టర్ బి. శ్రీనివాసరావు,హెడ్ కానిస్టేబుల్ కృష్ణార్జున, కానిస్టేబుల్స్ దొరబాబు, ఎ. రాజు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా?

విశాలాంధ్ర - జగ్గంపేట : వరి పంటలు ఎండి పోతున్నా పట్టించుకోరా అని జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగ్గంపేట నియోజకవర్గంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా 689వ రోజు జగ్గంపేట మండలం మన్యంవారిపాలెంలో ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. రైతులు తమ పొలాల్లోకి తీసుకుని వెళ్లి స్వయంగా వారి కష్టాల్ని చూపించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంట ఈనకపోవడమే కాక నేలంతా బీటలు వారిపోయాయన్నారు. రైతులంతా ఇప్పటికే పుష్కర కాలవ ద్వారా నీరు వస్తుందని నమ్మకంతో ఇంట్లో భార్య పిల్లల నగలు తాకట్టు పెట్టి మరీ యధావిధిగా పంటలు వేసి సుమారు ఎకరానికి 50 వేల రూపాయల పెట్టుబడి పెట్టారన్నారు. కొంత కాలం క్రితం స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు జిల్లా కలెక్టరు ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కొంత సమయానికే పైపులు లీకై నీరు ఆగిపోయిందన్నారు. ఈ పంట నష్టానికి కారణం ప్రభుత్వమే కాబట్టి రేపు సోమవారం జగ్గంపేట మండల తాహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో ధర్నా నిర్వహిస్తామన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి 50 వేల రూపాయల నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రైతులు, ప్రజలు, జనసైనికులు కలిసి రావాలని పిలుపునిచ్చారు.